సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం



శుక్రవారం । 8 । మార్చి । 2024

న్యూస్‌రీల్

రమణీయంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



అమ్మవారికి సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి అర్చకులు గురువారం 108 సువర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. అనంతరం హారతి, మంత్రపుష్పం, నివేదన సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి, కమిటీ సభ్యులు ఎస్వీఆర్‌కే ఆచార్యులు, చింత నాగరాజు, గంధం వెంగళరావు, వేదపండితుడు పద్మనాభశర్మ, అర్చకుడు రవికుమార్‌శర్మ పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా రాధామోహన్



రాధామోహన్

కొత్తగూడెంరూరల్: జిల్లా సర్వజన ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా మాతా శిశు సంరక్షణ కేంద్రం పిల్లల వైద్య నిపుణులు మార రాధామోహన్‌ను నియమిస్తూ డీఎంఈ వాణి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా కొనసాగుతున్న ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు నుంచి ఆయన సోమ లేదా మంగళవారాల్లో బాధ్యతలు తీసుకోనున్నారు. ప్రస్తుతం ఆయన సెలవులో ఉన్నారు.

ఆస్పత్రుల్లో నిబంధనలు పాటించాలి


కొత్తగూడెంరూరల్: కొత్తగూడెంలో నూతనంగా నిర్మించిన ఏఆర్‌టీ సెంటర్ లెవల్ 1, లెవల్ 2, గణేష్ టెంపుల్ ఏరియాల్లోని పలు ప్రైవేటు ఆస్పత్రులను డీఎంహెచ్‌ఓ శిరీష గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రుల్లో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-2010 నిబంధనలు పాటించాలని ఆదేశించారు. విదేశాల్లో చదివి ఇక్కడ ఆస్పత్రులు నిర్వహిస్తున్న వైద్యులను ఎంబీబీఎస్‌లుగానే పరిగణిస్తామని, వారు ఎండీగా బోర్డులు పెట్టుకోవద్దని సూచించారు. 2డీ ఎకో పరీక్షలు కేవలం గుండె వైద్య నిపుణులే చేయాలన్నారు. ఆయుష్, ఫిజియోథెరపీ, నేచర్ క్యూర్ నిర్వాహకులు సైతం అనుమతి తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ సుకృత, డీడీఎంహెచ్‌ఓ ఫైజ్‌మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, కొత్తగూడెంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో జరుగుతున్న ప్రసవాలు, ఆపరేషన్లను పీఓఎంసీహెచ్ అధికారి చైతన్య పరిశీలించారు.

మాకెందుకు భయం?



- కొన్నిచోట్ల మాత్రం వేధింపులు, చిన్నచూపు
- అయినా ఆత్మస్థైర్యమే అండ అంటున్న అతివలు
- 'సాక్షి' సర్వేలో యువతులు, మహిళల అభిప్రాయం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: నారీలోకం అడ్డంకులను అధిగమిస్తూ, ఇబ్బందులను దాటుకుంటూ అన్నిరంగాల్లో సత్తా చాటుతోంది. గతంతో పోలిస్తే లింగ వివక్ష తగ్గుముఖం పట్టడంతో మహిళాలోకం అన్నిచోట్లా రాణిస్తోంది. అయితే కొన్నిచోట్ల ఇప్పటికీ పురుషులు తమను చిన్నచూపు చూస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. అయినప్పటికీ అధైర్యపడకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్వే చేపట్టిన 'సాక్షి' 200మంది మహిళలు, యువతులు అభిప్రాయాలు సేకరించింది. గతంతో పోలిస్తే సురక్షితంగా, ఆందోళన లేకుండా ఉన్నామని, బహిరంగ ప్రదేశాల్లోనే కాక పని ప్రదేశాల్లోనూ ధైర్యంగా ఉంటున్నామని చెప్పారు. అయితే, రాత్రి, ఏజెన్సీలో మాత్రం భయంగా ఉంటోందని కొందరు, పట్టణ శివారు ప్రాంతాల్లో ఆకతాయిలతో ఇబ్బందిగా ఉంటుందని ఇంకొందరు తెలిపారు. పని ప్రదేశాల్లో మగవారి పెత్తనం ఎక్కువగా ఉంటోందని పలువురు చెప్పగా మరికొందరు మాత్రం గౌరవం లభిస్తోందని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో ప్రమాదం తప్పదనే భయంతో తప్పుడు పేర్లతో వేధించే వారు తగ్గారనే అభిప్రాయం వ్యక్తమైంది.



బీసీ బిడ్డగానే రాజ్యసభకు..



వేదికపై అభివాదం చేస్తున్న ఎంపీలు రవిచంద్ర, నామా, మాజీ మంత్రి పువ్వాడ తదితరులు

- బహుజనుల తరఫున బీఆర్‌ఎస్ అధినేతకు కృతజ్ఞతలు
- అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలబడతా
- కేసీఆర్‌కు కృతజ్ఞత సభలో ఎంపీ రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్: బీసీ బిడ్డగానే రెండోసారి రాజ్యసభలో అడుగుపెట్టే అవకాశం వచ్చిందని, ఇది తనకే కాకుండా బీసీలందరికీ దక్కిన గౌరవమని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. రాజ్యసభ సభ్యుడిగా రెండోసారి అవకాశం కల్పించిన సందర్భంగా ఖమ్మంలో గురువారం కేసీఆర్‌కు కృతజ్ఞత సభ నిర్వహించారు. ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్ అధ్యక్షతన జరిగిన సభలో వద్దిరాజు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌లో చేరిన అనతికాలంలోనే తనకు కేసీఆర్ తొలిసారి రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇవ్వగా, రెండోసారి కూడా ఎంపిక చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. బీసీల పట్ల నిబద్ధత, గౌరవం ఉన్న వ్యక్తిగా కేసీఆర్‌కు రుణపడి ఉన్నామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నామ నాగేశ్వరరావును ప్రకటించిన నేపథ్యాన ఆయనను గెలిపించి కేసీఆర్ రుణం తీర్చుకోవాలని కోరారు. ఎంపీ నామ నాగేశ్వరావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా నుంచి ఎమ్మెల్యేలను గెలిపించకపోయినా, జిల్లా అభివృద్ధి, సంక్షేమం కోసం కేసీఆర్ రూ.వేల కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. మరోసారి తనను గెలిపిస్తే రవిచంద్ర, తాను జిల్లా ప్రజలకు అండగా ఉంటామని అన్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాజ్యసభ సభ్యత్వం కోసం పలువురు పోటీ పడినా కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం వద్దిరాజు రవిచంద్రకు అవకాశం కల్పించారని తెలిపారు. కాగా, కాంగ్రెస్ బీసీల పదవులను తొలగిస్తూ వారి గొంతు కోస్తోందని విమర్శించారు. ప్రముఖ రచయిత జూలూరి గౌరీశంకర్ మాట్లాడగా, వద్దిరాజు రవిచంద్రను అభిమానులు, నాయకులు ఘనంగా సత్కరించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వి.ప్రకాశ్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు దూదిమెట్ల బాలరాజు యాదవ్, ఈడిగ ఆంజనేయులు గౌడ్, తాడూరి శ్రీనివాస్, రాజారాం యాదవ్, కొండబాల కోటేశ్వరరావు, మేయర్ నీరజ, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, హరిప్రియ, మదన్‌లాల్, తాటి వెంకటేశ్వర్లు, కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, నాయకులు మానవతారాయ్, కొండా దేవయ్య, ఆకుల గాంధీ, ఆర్.వీ.మహేందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈ సభలో గాయని మధుప్రియ పాటలు ఆకట్టుకున్నాయి.

కాంగ్రెస్ హామీలన్నీ మోసపూరితమే..

- మూడెకరాల భూమి ఉన్న వారికీ రైతుబంధు ఇవ్వలేదు
- ఎంపీలు నామ, వద్దిరాజు, మాజీ మంత్రి పువ్వాడ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో ప్రజలను వంచించి అధికారంలోకి వచ్చిందని, మరో పది రోజుల్లో ఆ పార్టీ బండారం బయటపడుతుందని ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మంలో గురువారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ఖమ్మం పార్లమెంటరీ స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లు పెంచుతామని, మహిళలకు నెలనెలా రూ.2,500 ఇస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మూడెకరాలు దాటిన రైతులకు ఇప్పటి వరకు రైతుబంధు ఇవ్వకపోవడం కాంగ్రెస్ తీరుకు నిదర్శనమన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేస్తే నీతిఆయోగ్ వంటి సంస్థలు అభినందించాయని గుర్తుచేశారు. కేసీఆర్ పాలనలో ఏనాడూ విద్యుత్, తాగు, సాగునీటి కోసం ప్రజలు రోడ్డెక్కిన దాఖలాలు లేవని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే విద్యుత్ కోతలతోపాటు తాగు, సాగునీటికి తండ్లాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. కాగా, ఖమ్మం ఎంపీగా నామ నాగేశ్వరరావును మరోమారు గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ ఇక్కడి నుంచి తగినన్ని సీట్లు రాకున్నా ప్రజలపై అభిమానంతో రాజ్యసభ స్థానాన్ని మళ్లీ రవిచంద్రకు ఇవ్వడం అభినందనీయమన్నారు. నామాను మరోమారు ఎంపీ అభ్యర్థిగా ఎంపిక చేయడం హర్షణీయమని అన్నారు. కాగా, మధిరకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బొమ్మెర రామ్మూర్తి పార్టీలో ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వడం లేదంటూ అసహనం వ్యక్తం చేయగా నేతలు సముదాయించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, ఖమ్మం జెడ్పీ చైర్మన్ కమల్‌రాజు, మాజీ ఎమ్మెల్యేలు బానోతు మదన్‌లాల్, మెచ్చా నాగేశ్వరరావు, చంద్రావతి, తాటి వెంకటేశ్వర్లు, డీసీసీబీ మాజీ చైర్మన్ నాగభూషణం, కోనేరు చిన్ని, ఖమర్, పగడాల నాగరాజు, బచ్చు విజయ్‌కుమార్, బిచ్చాల తిరుమలరావు, కర్నాటి కృష్ణ, ఉప్పల వెంకటరమణ, సున్నం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నుంచే వివక్ష వీడాలి



మహిళా దినోత్సవ వేడుకలు చేసుకుంటున్న విద్యార్థినులు

- కుమారుడైనా, కూతురైనా సమానంగా చూడాలి
- విద్య, ఉద్యోగాల్లో కట్టుబాట్లు, చిన్నచూపు వద్దు
- ప్రభుత్వాలు కఠినచట్టాలు తీసుకొస్తేనే మహిళలకు రక్షణ
- 'సాక్షి' చర్చావేదికలో విద్యార్థినుల మనోగతం

ఖమ్మం సహకారనగర్: తొలుత ఇళ్లలోనే మహిళలపై వివక్ష వీడాలి. దేశం ఇంత అభివృద్ధి చెందుతున్నా.. మహిళలు విద్య, ఉద్యోగంతో పాటు పలురంగాల్లో వివక్ష ఎదుర్కోవాల్సి వస్తోందని విద్యార్థినులు అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం 'సాక్షి' మీడియా ఆధ్వర్యాన ఖమ్మంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలో 'ఆడపిల్లలపై వివక్షత..' అంశంపై టాక్ షో నిర్వహించగా విద్యార్థినులు తమ అభిప్రాయాలు వెల్లడించారు. సమాజం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతున్నా ఇంటి నుంచి కూడా వివక్ష ఎదురవుతోందని తెలిపారు. అలాగే, చదువు, ఉద్యోగం వద్ద సైతం మహిళలపై చిన్నచూపే ఉందని పేర్కొన్నారు.

మగపిల్లలకే ప్రాధాన్యత

కొందరి ఇళ్లలో ఒక అబ్బాయి, ఒక అమ్మాయి ఉంటే అబ్బాయికే ప్రాధాన్యత ఇస్తుండడం చాలా చోట్ల కనిపిస్తోందని విద్యార్థినులు తెలిపారు. అలాగే, అమ్మాయిల చదువుపై తల్లిదండ్రులు ఇంకా కొన్నిచోట్ల ఆసక్తి చూపించటం లేదని చెప్పారు. కుమారులను ఉన్నత చదువులకు విదేశాలకు పంపిస్తున్నా ఆడపిల్లల విషయంలో కొందరు సంకుచితంగా ఆలోచిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనాలంటే తల్లిదండ్రులను ఒప్పించడానికి ఇబ్బంది ఎదురవుతోందని చెప్పారు. అలాకాకుండా తల్లిదండ్రులు ఆడపిల్లలను విద్య, ఉద్యోగం, వ్యాపార రంగాల్లో ప్రోత్సహించాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తల్లిదండ్రులకు తమ పిల్లలపై ఉన్న ప్రేమను నిబంధనలుగా మార్చొద్దని కోరారు. ఇక మహిళలపై దాడులు జరిగినప్పుడే కాకుండా ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకొస్తే దాడులే జరగవని తెలిపారు.

ఆడపిల్ల అంటేనే భయం..



ప్రస్తుతం ఆడపిల్ల అంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. భవిష్యత్‌లో తల్లిదండ్రులు అనే వారు ఉండే పరిస్థితులు కూడా కష్టంగానే ఉంటాయి. సమాజంలో మహిళలపై వివక్ష కొనసాగుతున్న క్రమంలోనే ఆడపిల్ల అంటే తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

– మెహిత, బీఏ, ద్వితీయ సంవత్సరం

అణచివేత ఆగాలి



కొన్నిచోట్ల ఆడపిల్లలపై అణిచివేత ఉంది. నాకు నృత్యం, పాటలంటే ఇష్టం. ఇలాంటి ఇష్టాలు ఉన్న వారు నేర్చుకోవడం, పోటీలకు వెళ్లేందుకు తల్లిదండ్రులకు ఒప్పించడం కష్టమవుతోంది. అలాకాకుండా ప్రోత్సహించాలి. అమ్మాయిలు కూడా స్వేచ్ఛను దుర్వినియోగం చేయొద్దు.

– ఆర్.సంజీవిని, బీఏ, ద్వితీయ సంవత్సరం

విద్య విషయంలో వివక్ష



ప్రస్తుత సమాజంలో ఉన్నత చదువులపై వివక్ష కొనసాగుతూనే ఉంది. తల్లిదండ్రులు ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు ఇప్పటికీ ఆలోచిస్తూనే ఉన్నారు. అమ్మాయిలను బాగా చదివిస్తే వారు కూడా సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారు.

– రమ్యశ్రీ, బీఎస్సీ, ద్వితీయ సంవత్సరం

బాధ్యతగా భావిస్తేనే...



తల్లిదండ్రులు తమ పిల్లల పెంపకాన్ని బాధ్యతగా భావిస్తూ ఆడపిల్లల విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటారు. అమ్మాయిలు పెళ్లి తర్వాత ఇబ్బంది పడొద్దని పనులు నేర్పిస్తుంటారు. అదే అబ్బాయిలకు ఎందుకు నేర్పించరు? వారూ కొన్ని పనులు చేసుకునేలా చెప్పాలి.

– ఏ.అఖిల, బీఏ, ద్వితీయ సంవత్సరం

హరహర మహాదేవ..



శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయం

- అన్నపురెడ్డిపల్లి ఆలయమే శివలింగాకారం
- ఆధ్యాత్మికత, ఆహ్లాదం మేళవింపు
- హరి, హరుల దర్శన భాగ్యం ఇక్కడి ప్రత్యేకత
- జిల్లా వ్యాప్తంగా మహా శివరాత్రికి ముస్తాబైన శైవక్షేత్రాలు

అన్నపురెడ్డిపల్లి : అన్నపురెడ్డిపల్లిలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయం మహాశివరాత్రికి ముస్తాబైంది. మృత్యుంజయ స్వామిగా పేరుగాంచిన ఈ స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడంతోపాటు క్యూలైన్‌లు, వసతులు ఏర్పాటుచేశారు. స్వామివారి కల్యాణాన్ని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం సత్తుపల్లి, కొత్తగూడెం నుంచి ఆర్టీసీ బస్సులు నడపనున్నారు.

శివలింగాకారంలో..

భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయం శివలింగాకారంలో నిర్మితమైంది. 108 శివలింగాలతో ఈ ఆలయాన్ని నిర్మించారు. దీంతోపాటు శ్రీవైష్ణవ సంప్రదాయాలతో నాలుగు గోపురాలతో శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం కూడా ఉండడంతో ఈ గ్రామానికి వచ్చిన భక్తులకు హరి, హరుల దర్శన భాగ్యం కలుగుతోంది. ఇక మల్లికార్జున స్వామి వారి ఆలయంలో ఆహ్లాదకర వాతావరణం నెలకొని ఉంటుంది. చుట్టూ కొండలు, పచ్చని పైరులతో పాటు ఆలయానికి ఎదురుగా అన్నదైవం ప్రాజెక్ట్ ఉండడంతో భక్తులు ఆహ్లాదకర వాతావరణంలో భక్తి పారవశ్యంలో మునిగి తేలుతుంటారు.

ఆకట్టుకునేలా విగ్రహాలు..

శివాలయ ప్రాంగణంలో భారీగా నిర్మించిన శివపార్వతులు, దక్షిణామూర్తి, భక్త మార్కండేయ, భక్త కన్నప్ప ,శ్రీఆంజనేయ స్వామి, నంది విగ్రహాలు కనువిందు చేస్తాయి. మహా జలలింగం ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. ఈ ఆలయాన్ని 2013లో దేవాదాయ శాఖకు అప్పగించారు.

ప్రారంభమైన ఉత్సవాలు..

శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి.

గద్దెనెక్కిన ఇలవేల్పులు



ఊరేగింపులో కిక్కిరిసిన భక్తులు

- సమ్మక్క రాకతో నిండుజాతర ప్రారంభం
- వైభవంగా పగిడిద్దరాజు – సమ్మక్కల నాగవెల్లి



గుట్టనుంచి దేవతలను తీసుకొస్తున్న పూజారులు, భక్తులు

గుండాల : గిరిజనుల ఇలవేల్పులైన పగిడిద్దరాజు – సమ్మక్క గద్దెలపై కొలువుదీరారు. వన దేవత సమ్మక్క రాకతో నిండుజాతర ప్రారంభమైంది. పగిడిద్దరాజు ఒకరోజు ముందే గద్దె పైకి రావడంతో భక్తులు భారీగా మొక్కులు చెల్లించుకున్నారు. ఇక గురువారం పగిడిద్దరాజు–సమ్మక్క దేవతలకు ఎదురిళ్లు, నాగవెల్లి కార్యక్రమాలు నిర్వహించారు. పూజారులు, వడ్డెలు, తలపతులు దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగు గంటలకు జోగు నిర్వహించి, రాత్రి 8 గంటలకు గంగాస్నానం చేయించి గుడి నింపారు. వనదేవతలను గద్దెల వద్దకు చేర్చే క్రమంలో భక్తులు భారీగా పోటెత్తారు. దారి పొడవునా డోలి వాయిద్యాలు, ఆదివాసీల నృత్యాలు ఆకట్టుకున్నాయి. దేవతలను దర్శించుకున్న భక్తులు, బంగారం(బెల్లం), కొబ్బరికాయలు సమర్పించారు. కోళ్లు, మేకలను బలిచ్చారు. మేడారం ట్రస్టు చైర్మన్ లచ్చూ పటేల్ దేవతలను దర్శించుకున్నారు. కార్యక్రమంలో పూజారులు అర్రెం అప్పయ్య, లక్ష్మినర్సు, కాంతారావు, పెద్దకాంతారావు, నాగేశ్వరావు, బిక్షం, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఘనంగా మహిళా దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల


సూపర్‌బజార్(కొత్తగూడెం): వివిధ రంగాల్లో మహిళలే బలవంతులని కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం మహిళా దినోత్సవ వేడుకల్లో ఆమె కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని అన్నారు. కొన్ని దేశాల్లో మహిళలకు అనేక కట్టుబాట్లు విధించారని, దీంతో వచ్చే చిన్నచూపును తొలగించడానికే మహిళా దినోత్సవం నిర్వహించుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ గన్యా, కలెక్టరేట్ సిబ్బంది రమాదేవి, హైందవి, పద్మ, సౌజన్య, స్వాతి, నవ్య పాల్గొన్నారు.

మహిళల గౌరవానికి ప్రాధాన్యత

కొత్తగూడెంటౌన్: మహిళల సంక్షేమం, రక్షణతోపాటు వారి గౌరవానికి తమ శాఖ ప్రాధాన్యత ఇస్తుందని ఎస్పీ రోహిత్‌రాజ్ అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన చేసిన ఎస్పీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక, ఆర్థిక, రాజకీయాల్లో మహిళలకు సముచిత స్థానం కల్పిస్తేనే వారు ప్రగతిబాటలో పయనించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పోలీసు ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్‌ను పాటిస్తూ ప్రతీ స్టేషన్‌లో మహిళా పోలీసులను నియమించినట్లు తెలిపారు.

ఐటీడీఏ పీఓ శుభాకాంక్షలు

భద్రాచలం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ గురువారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. శుక్రవారం మహిళా దినోత్సవం సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక, ఆర్థిక, రాజకీయాల రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలకు కల్పించిన స్థానాన్ని బట్టి సమాజ ప్రగతి ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారతకు, ధర్మబద్ధమైన సమానత్వానికి, ప్రగతికి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాయని తెలిపారు.



స్త్రీ లేకపోతే జననం లేదు, స్త్రీ లేకపోతే గమనం లేదు... స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదు, స్త్రీ లేకపోతే అసలు సృష్టే లేదు.
మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

జయహో ..జనయిత్రి..

ఖమ్మంగాంధీచౌక్ : మహిళల స్థితిగతులు బాగుపడనిదే సమాజం అభివృద్ధి చెందదు. సమాజంలో అన్నీ మారుతున్నాయి.. అయితే మహిళల పట్ల ఆలోచనా ధోరణి మాత్రం మారడం లేదు. ×యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతః అని ఆర్యోక్తి. ఎక్కడ స్త్రీలు పూజలందుకుంటారో.. అక్కడ దేవతలు కొలువై ఉంటారు అని. దేవతగా కొలవాల్సిన స్త్రీమూర్తిపై అఘాయిత్యాలు సర్వసాధారణ మయ్యాయి. మహిళా సమానత్వమే ప్రగతికి మూలం. దీనిని గుర్తు చేయడానికే ఐక్యరాజ్యసమితి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహిస్తోంది.

సమాజంలో మహిళలు ఆత్మ గౌరవంతో, స్వశక్తితో తమ ఆర్థిక అవసరాలను తామే తీర్చుకోగలిగే, నిరంతర జీవనాధార అవకాశాలు తామే స్వయంగా నిర్మించుకోగలిగే ఉన్నత స్థాయికి చేరుకుని తమ శక్తి ఏమిటో ఇప్పటికే ప్రపంచానికి చాటిచెప్పారు. విద్య, వైద్యం, వ్యాపారాలు, రాజకీయాలు, క్రీడలు, బ్యాంకింగ్, అంతరిక్షం, సాంకేతిక వంటి రంగాల్లో మహిళలు రాణిస్తూ సాధికారత సాధన దిశగా అడుగులు వేస్తున్నారు. రంగం ఏదైనా ఉన్నత శిఖరాలను చేరుకుని పురుషశక్తికి తామేమీ తీసిపోమని చాటిచెబు తోంది స్త్రీ శక్తి. అయితే సమాజంలో మహిళ పట్ల చిన్నచూపుతో ఇంకా దారుణాలను చవిచూస్తేనే ఉన్నారు. మహిళలపై దారుణ అఘాయిత్యా లకు అంతులేకుండా పోతోంది. వీటిని నియంత్రించేందుకు ఎంతటి కఠిన చట్టాలను తీసుకొచ్చిన ఫలితం లేకుండాపోతోంది. ఇందుకు కారణాలు గుర్తించాలి. నారీలోకం అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ.. అవరోధాలను అధిగమిస్తూ.. ముంద డుగు వేయాలి.. తమ స్వశక్తితో ఎదిగి.. సమాజంలో తమకంటూ ఒక స్థానం సంపాదించుకున్న అటు ఉద్యోగ, వ్యాపార, సామాజిక రంగాల్లో తమ సేవలను అందిస్తున్న మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు



మహిళలు విద్యావంతులై తమతోపాటు కుటుంబాన్ని సమాజ్యాన్ని అభివృద్ధిపైపు నడిపించాలి, వేలాది మంది విద్యార్థులకు విద్యనందిస్తూ, తోటి మహిళలకు ఉపాధినందించడం సంతోషంగా ఉంది.

కాటిరెడ్డి నాగమణి
చైర్‌పర్సన్, కెయల్‌ఆర్ గ్రూఫ్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్, పాల్వంచ



గత 15 సం॥లుగా ఏజెన్సీలో విశేష వైద్య సేవలు అందిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉన్నది. మహిళలు అందరు వారి వారి రంగాలలో రాణించి నప్పుడు మాత్రమే నిజమైన సమాజాభివృద్ధి జరుగుతుంది.

డా॥ కె. సరోజిని కుమారి
స్త్రీ. ప్రసూతి వైద్య నిపుణులు



ప్రేమ, సహనం, సున్నితత్వానికి మరో పేరు మహిళ, మాయమౌతున్న అమ్మని రక్షించుకుందాం. మాతృత్వాన్ని కాపాడుకుందాం. మహిళలందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

జి. సౌభాగ్య, కరెస్పాండెంట్
విద్యాక్షేత్ర స్కూల్, ఖమ్మం.



విద్య ద్వారానే మహిళా వికాసం మరియు సమాజ అభివృద్ధి జరుగుతుంది. నేను ఉపాధి పొందుతూ నా తోటి మహిళలకు ఉపాధి నివ్వడం సంతోషంగా తృప్తిగా ఉన్నది. మహిళలు అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

వై. లావణ్య, చైర్‌పర్సన్
వికాస్ స్కూల్, ఖమ్మం.



పేద, మధ్యతరగతి ప్రజలకు మా వంతు వైద్య సేవలు అందిస్తూ మా తోటి మహిళలకు ఉపాధినివ్వడం సంతోషంగా ఉన్నది. మహిళలు అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు.

డా॥ స్వాతి జంగాల,
డయాబెటాలజిస్ట్,
జాయింట్ సెక్రటరీ, ఐ.యం.ఎ., ఖమ్మం.



ఆరోగ్య కరమైన సమాజాన్ని నిర్మించడంలో మా వంతుగా పేద, మధ్యతరగతి ప్రజలకు అత్యుత్తమ వైద్యసేవలు అందిస్తూ ఎంతోమందికి సేవలందిస్తున్నాము. ప్రతి మహిళా ఆత్మవిశ్వాసంతో ముందుకు నడవాలి.

డా॥ వై. రమాదేవి
స్త్రీ. ప్రసూతి వైద్య నిపుణులు



ప్రతిష్ఠాత్మకంగా వెల్లూరు సియంసి కాలేజీలో టాపర్‌గా నిలిచి ఐ.వి.ఎఫ్. స్పెషలిస్ట్‌గా హైఅడ్వాన్స్‌ఐ.వి.ఎఫ్.సెంటర్‌గా గుర్తింపు కల్గిన మా శ్రీగర్భలో తక్కువ ఖర్చుతో ఎంతో మందికి సంతానం కల్పించినందుకు సంతోషంగా ఉంది.

డా॥ సుజాత రెడ్డి
శ్రీగర్భ ఫెర్టిలిటి సెంటర్, ఖమ్మం.



ఖమ్మం విద్యారంగంలో మహిళల పాత్ర ఎంతో గర్వించదగినది. తల్లి తర్వాత తల్లిలా పిల్లలను ఎంతో గొప్పగా తీర్చిదిద్దుతున్న మా మహిళా టీచర్స్ అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

షిఫాలి జగదీష్ శర్మ, కరెస్పాండెంట్,
శ్రీ జయశ్లోక హైస్కూల్,
ఖానాపురం హవేలీ, ఖమ్మం.



మహిళలు స్వయంకృషి, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. ఖమ్మంలో ఏకైక ఎండోక్రైనాలజిస్ట్ మరియు మహిళా ఫిజీషియన్‌గా పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలు అందించడం సంతోషంగా ఉంది.

డా॥ కావ్యచంద్ యాలముడి
సిఇఓ, కావ్య హాస్పిటల్, ఖమ్మం.



మహిళలందరూ ఆర్థికంగా ఎదగాలి, సంతానలేమి, గర్భాశయ, వెన్నుముక, నరాలు మరియు కీళ్ళు నొప్పులు సమస్యతో బాధపడే పేద ప్రజలకు అధునాతన వైద్యం అందించడం సంతోషాంగా ఉంది.

డా॥ ఆస్మా
షిఫా హాస్పిటల్, ఖమ్మం.








ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
ఖమ్మం - 9912220600























పొత్తుపై నేడు స్పష్టత!

- అమిత్ షా, నడ్డాలతో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష పార్టీల పొత్తుల వ్యవహారంలో శుక్రవారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది. న్యూఢిల్లీలో గురువారం రాత్రి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలతో అమిత్ షా నివాసంలో టీడీపీ, జనసేన అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. పొత్తులు, సీట్ల సర్దుబాటుపై వీరు చర్చించినట్లు సమాచారం. తమకు 8–10 లోక్‌సభ స్థానాలు, 15–20 అసెంబ్లీ స్థానాలు ఇస్తేనే పొత్తుకు ఓకే చెబుతామని బీజేపీ పెద్దలు కరాఖండిగా చెప్పారని తెలిసింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై శుక్రవారం ఒక స్పష్టత రానుండగా.. సీట్ల సర్దుబాటు విషయంలో బీజేపీ పెద్దలతో జరిగిన భేటీకి సంబంధించి ఏ క్షణాన్నైనా ఒక అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. 2018లో ఎన్డీఏ నుంచి టీడీపీ బయటికి వెళ్లిపోయిన తర్వాత విశాఖపట్నం, రాజంపేట. రాజమండ్రి, హిందూపురం, తిరుపతి, అరకు, విజయవాడ వంటి లోక్‌సభ నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతంపై తాము ఏ విధంగా ప్రత్యేక దృష్టి సారించామన్న అంశాన్ని బీజేపీ పెద్దలు చర్చల సందర్భంగా తెరపైకి తెచ్చారు. అందువల్ల తామడిగిన లోక్‌సభ స్థానాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కేటాయించాలని బీజేపీ అగ్రనేతలు చంద్రబాబు, పవన్‌లకు స్పష్టం చేశారని తెలిసింది.

‘చేయూత’ పండుగ

- మహిళా దినోత్సవ వేళ అక్కచెల్లెమ్మలకు సాయాన్ని అందించడం ఎంతో సంతోషాన్నిస్తోంది: అనకాపల్లి సభలో ఏపీ సీఎం జగన్
- వైఎస్సార్ చేయూతతో 2,698,931 మంది లబ్ధిదారులకు రూ.5,060.49 కోట్లు సాయం
- 14 రోజుల పాటు పండుగ వాతావరణంలో ‘చేయూత’ కార్యక్రమాలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: అక్కచెల్లెమ్మల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా మనందరి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, మహిళా దినోత్సవం ముందు రోజు ‘వైఎస్సార్ చేయూత’ ద్వారా ఆర్థిక సాయం అందించడం ఎంతో సంతోషం కలిగిస్తోందని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. మహిళా సాధికారత పట్ల ఇంత చిత్తశుద్ధి చూపిన ప్రభుత్వం దేశ చరిత్రలోనే మరొకటి లేదన్నారు. 45 – 60 ఏళ్ల వయసున్న మహిళలకు నాలుగో విడత ఆర్థిక సాయం అందించే వైఎస్సార్ చేయూత కార్యక్రమాన్ని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన అనకాపల్లి జిల్లాలోనే నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ ఆర్థిక సాయంతో ఎదిగిన మహిళలంతా తమ విజయగాథలను వివరిస్తూ రానున్న 14 రోజుల పాటు సచివాలయాలవారీగా కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు – దత్తపుత్రుడు గతంలో మేనిఫెస్టోలో అక్కాచెల్లెమ్మలకు ఇచ్చిన ఏ వాగ్దానాన్నీ అమలు చేయలేదని మండిపడ్డారు. వారి పేరు చెబితే ఎనిమిది రకాల మోసాలు, దగా గుర్తురాగా మన ప్రభుత్వం పేరు చెబితే సంక్షేమం గుర్తుకొస్తుందన్నారు. చంద్రబాబును చూస్తే విశ్వసనీయతలేమి గుర్తుకొస్తుందని, దత్తపుత్రుడి పేరు చెబితే వివాహ వ్యవస్థకే కళంకం తెచ్చేలా కార్లను మార్చినట్లు భార్యలను మార్చే వ్యవహారం



అనకాపల్లి సభలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్

గుర్తుకొస్తుందని విమర్శించారు. వారిని నమ్మితే కాటేసే పామును నమ్మినట్టేనని, తినేసే పులిని ఇంటిని తెచ్చుకోవడమేనని హెచ్చరించారు. ప్రతి ఇంటికీ మేలు చేసిన మీ బిడ్డకు మీరే స్టార్ క్యాంపైనర్లుగా నిలిచి మంచి చేసిన ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ చేయూత నాలుగో విడత కింద రాష్ట్రవ్యాప్తంగా 26,98,931 మంది అక్కచెల్లెమ్మలకు రూ.5,060.49 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించే కార్యక్రమాన్ని గురువారం అనకాపల్లి జిల్లా కశింకోట మండలం పిసినికాడలో సీఎం జగన్ ప్రారంభించారు.

4 రోజుల్లో 850 ఎకరాలా!

▶ మొదటి పేజీ తరువాయి

ఐఎంజీ భారత్‌తో ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. క్రీడల్లో రాష్ట్ర యువతను చాంపియన్లుగా తీర్చిదిద్దడం కోసం అంటూ ఈ ఎంవోయూ చేసుకుంది. ఇందులో భాగంగా స్పోర్ట్స్ అకాడమీలను నిర్మించడం, అభివృద్ధి చేయడం, నిర్వహించడం కోసం అంటూ రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి సర్వే నంబర్ 25లో 400 ఎకరాలు ఇచ్చేందుకు అంగీకరించింది. అలాగే రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం మామిడిపల్లి సర్వే నంబర్ 99/1లోని మరో 450 ఎకరాలు అప్పగించేందుకు కూడా ఒప్పందం చేసుకుంది. అంతేకాకుండా ఐఎంజీ భారత్ అంతర్జాతీయ స్థాయిలో ప్రధాన కార్యాలయాన్ని నిర్మించుకునేందుకు బంజారాహిల్స్ నుంచి మాదాపూర్ వెళ్లే మార్గంలో ఎకరం నుంచి 5 ఎకరాలు కూడా ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు 2004, ఫిబ్రవరిలో గచ్చిబౌలిలో ఎంతో విలువైన 400 ఎకరాలను స్వల్ప మొత్తానికి అంటే కేవలం రూ.2 కోట్లకే ఐఎంజీ భారత్‌కు అప్పగించింది (సేల్ డీడ్ చేసింది). అయితే 2006లో ప్రభుత్వ ఆస్తులను కాపాడే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చింది. 2007లో దీన్ని చట్టబద్ధం చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆస్తి (పరిరక్షణ, రక్షణ, పునఃప్రారంభం) చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్ట ప్రకారం ఐఎంజీ భారత్‌తో అంతకుముందు ప్రభుత్వం చేసుకున్న ఎంఓయూ, ఆ మేరకు సేల్‌డీడ్ కూడా రద్దయ్యాయి. ఈ క్రమంలో 2007 చట్టంలోని సెక్షన్ 2 ప్రకారం సంబంధిత లావాదేవీలు రద్దు చేయడమే కాకుండా ఐఎంజీ చెల్లించిన మొత్తాన్ని ఏడాదికి 12 శాతం వడ్డీతో తిరిగి ఇచ్చేయడానికి ప్రభుత్వం ముందుకొచ్చింది. అయితే ప్రభుత్వ చట్టాన్ని సవాల్ చేస్తూ ఐఎంజీ భారత్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

పూర్తి కేబినెట్ ఆమోదం లేదు: ఏజీ

‘పూర్తి కేబినెట్ ఆమోదం లేకుండా నాటి ప్రభుత్వం ఎంఓయూపై సంతకాలు చేసింది. ఆ సమయంలో భూమి విలువ ఎకరం రూ.13 లక్షలు ఉండగా, పిటిషనర్‌కు రూ.50 వేల స్వల్ప మొత్తానికే సరైన ఎలాంటి కారణం లేకుండా విక్రయించారు. ఐఎంజీ భారత్‌కు అమెరికన్ కంపెనీ అయిన ఐఎంజీతో ఎలాంటి సంబంధం లేదు. కానీ దానికి అనుబంధ సంస్థ అంటూ మోసగించారు. అందుకే తదుపరి ప్రభుత్వం ఎంవోయూను రద్దు చేసింది. పరిహారం ఇవ్వాలని కూడా నిర్ణయించింది. 2007లో ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం ఒక్క ఐఎంజీ కోసమే కాదు. ఇది ఇతర భూ లావాదేవీలకు కూడా వర్తిస్తుంది. ఇలా చట్టం తీసుకొచ్చే అధికారం రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్ ప్రకారం శాసనసభకు ఉంది. రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత 2007లో చేసిన చట్టం అమల్లోకి వచ్చింది..’అంటూ అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కాగా పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ..‘ఒక ఐఎంజీ భారత్ కోసమే చట్టాన్ని తేవడం సమర్థనీయం కాదు. ఎంవోయూను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి లేదు..’అంటూ వాదించారు.

ఎలాంటి విచారణ చేయకుండానే ఆమోదం: ధర్మాసనం

‘2003 ఆగస్టు 5న ఐఎంజీ భారత్ ఏర్పాటైన తర్వాతి రోజే, ఎలాంటి విచారణ చేసుకోకుండానే 6న నాటి యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం, కల్చరల్ డిపార్ట్‌మెంట్ కంపెనీకి ఆమోదం తెలుపుతూ సర్క్యులర్ జారీ చేసింది. అదే రోజు నలుగురు మంత్రులతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దీనికి ఆగమేఘాలపై గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఆ తర్వాత 9వ తేదీన ఎంవోయూ కుదుర్చుకున్నారు. స్పోర్ట్స్ అకాడమీ, స్టేడియాల నిర్వహణకయ్యే ఖర్చు ఏడాదికి రూ.2.5 కోట్లు లేదా అంతకంటే ఎక్కువ అయితే ఆ మొత్తాన్ని కూడా ప్రభుత్వమే భరిస్తుందని ఒప్పందంలో పేర్కొన్నారు. తొలి మూడేళ్లపాటు విద్యుత్, నీటి, సీవేజ్, డ్రైనేజీ బిల్లులనూ 100 శాతం తిరిగి చెల్లిస్తామని చెప్పారు. ఆ తర్వాత క్రమంగా దీన్ని తగ్గిస్తామని తెలిపారు. ముఖ్యంగా పిటిషనర్‌కు అంతర్జాతీయ క్రీడా సంస్థ (ఐఎంజీ, అమెరికా)తో సంబంధం గానీ, గతంలో క్రీడా రంగంలో అనుభవం గానీ లేవు. ఉన్నట్లుగా పిటిషనర్ ఐఎంజీ ఎలాంటి పత్రాలను ప్రభుత్వానికి సమర్పించలేదు.

ప్రభుత్వం రద్దయ్యాక 400 ఎకరాలకు సేల్‌డీడ్!

2003, నవంబర్ 14నే చంద్రబాబు ప్రభుత్వం రద్దయ్యింది. తర్వాత ఆపద్ధర్మ ప్రభుత్వంగా మాత్రమే కొనసాగింది. ఈ ఆపద్ధర్మ ప్రభుత్వ హయాంలోనే 400 ఎకరాలను నామమాత్రపు ధరకు ఐఎంజీ భారత్‌కు అప్పగిస్తూ సేల్‌డీడ్ చేసింది. అయితే 2007లో భూములపై రాష్ట్ర శాసనసభకు ఉన్న అధికారాలతోనే ప్రభుత్వం చట్టాన్ని రూపొందించింది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో సరైన కారణాలు ఉన్నప్పుడు రాజ్యాంగం ప్రభుత్వానికి ఈ అధికారం కల్పించింది. జాగ్రత్తగా గమనిస్తే.. కంపెనీ ఏర్పాటైన కేవలం 4 రోజుల్లోనే వేల కోట్ల విలువచేసే వందల ఎకరాల భూములు అప్పగించారు. మరే ఇతర కంపెనీకి రాష్ట్రంలో అంత స్వల్ప సమయంలో ఇలా భూములు ధారాదత్తం చేయలేదు. పిటిషనర్‌కు పరిహారం కోరే హక్కు ఉంది. అయితే 2007లో తీసుకొచ్చిన చట్టాన్ని తన ఒక్క కంపెనీ కోసమే అంటూ సవాల్ చేయలేరు.

ప్రజా ఆస్తుల పరిరక్షణకే వైఎస్ సర్కార్ చట్టం..

రాజ్యాంగంలోని ఆర్టికల్ 14ను ప్రభుత్వం ఉల్లంఘించిందన్న వాదన కూడా సరికాదు. ప్రజల ఆస్తులను కాపాడటం కోసమే 2007లో వైఎస్ సర్కార్ చట్టం తీసుకొచ్చింది. అది ఎవరి వ్యక్తిగత అవసరాల కోసం కాదన్న విషయం గ్రహించాలి. కంపెనీ ఏర్పాటు చేసిన నాలుగు రోజుల్లో వేల కోట్ల భూములు గతంలో మరే ఇతర కంపెనీకి ప్రభుత్వం కేటాయించినట్లుగా ఐఎంజీ నిరూపించలేకపోయింది. అలాగే ప్రభుత్వం చేసిన చట్టం చెల్లుబాటును అడ్డుకునేందుకు ఇందులో ఎలాంటి ఉల్లంఘనలు కూడా జరగలేదు. సేల్ డీడ్‌ను రద్దు చేయకూడదనే వాదన ఆమోదానికి అర్హమైనది కాదు. ఎంఓయూనే రద్దయినప్పుడు సేల్‌డీడ్ అమల్లో ఉండటం సాధ్యం కాదు..’అంటూ ధర్మాసనం తన తీర్పులో వ్యాఖ్యానించింది.

సీబీఐ విచారణకు లేఖ రాశామన్నారుగా..

‘ఐఎంజీ భారత్‌కు భూముల అప్పగింతపై సీబీఐ విచారణ కోరుతూ గతంలో లేఖ రాశాం అన్నారు.. ఎంత వరకు వచ్చింది? మీరు విచారణ కోరతారా? లేక మమ్మల్నే సీబీఐకి అప్పగిస్తూ ఆదేశాలు ఇవ్వమంటారా?’అని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. తదుపరి విచారణలోగా ఏదో ఒకటి చెప్పాలని ఆదేశిస్తూ, విచారణను వారం పాటు వాయిదా వేసింది. ఐఎంజీ భారత్‌కు భూముల కేటాయింపు, ఎంవోయూ, సేల్ డీడ్.. ఇలా అన్ని అంశాలపై కేంద్ర దర్యాప్తు బృందం (సీబీఐ)తో విచారణ జరిపించాలని కోరుతూ టి.శ్రీరంగారావుతో పాటు మరొకరు 2012లో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ ఒప్పందం వెనుక పెద్ద ఎత్తున ప్రజాధనం దుర్వినియోగం చేసే ప్రయత్నం జరిగిందని, దీని వెనుక ఉన్న కుట్రదారులెవరో తేల్చాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ పిటిషన్లను గురువారం మరోసారి సీజే ధర్మాసనం విచారించింది. సీబీఐకి అప్పగించే విషయంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోందని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది గంద్ర మోహన్‌రావు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీనిపై ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ అభిప్రాయం ధర్మాసనం కోరింది. ఆయన తమకు కొంత సమయం కావాలనడాన్ని, ప్రభుత్వాన్ని సంప్రదించిన తర్వాత తెలియజేస్తాననడాన్ని తప్పుబట్టింది. ఇంకా ఎంతకాలం ఆగాలని, వారంలోగా ఏదో ఒకటి తేల్చిచెప్పాలని ఆదేశిస్తూ విచారణ వాయిదా వేసింది. కాగా గతంలో ఇదే పిల్‌పై విచారణ సందర్భంగా ప్రభుత్వం కోరితే దర్యాప్తు చేయడానికి సిద్ధంగా ఉన్నామని న్యాయస్థానానికి సీబీఐ తెలియజేయడం గమనార్హం.

10 మందితో కాంగ్రెస్ తొలి జాబితా!

- ఢిల్లీలో సమావేశమైన పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ
- సర్వేలు, సమీకరణాలు పరిగణనలోకి తీసుకుని అభ్యర్థుల ఎంపిక

సాక్షి, న్యూఢిల్లీ:వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై తొలి విడత కసరత్తును ఏఐసీసీ అగ్ర నాయకత్వం పూర్తి చేసింది. తెలంగాణలోని సుమారు పది స్థానాలకు అభ్యర్థులను ఫైనల్ చేసింది. ప్రాంతీయ, కుల సమీకరణలు, రాజకీయ నేపథ్యం, సర్వేల్లో విజయావకాశాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసింది. అభ్యర్థుల ప్రకటన ఏక్షణమైనా వెలువడవచ్చని ఏఐసీసీ వర్గాలు తెలిపాయి. పెద్దపల్లిలో గడ్డం వంశీ, మహబూబ్‌నగర్‌లో వంశీచంద్‌రెడ్డి, నిజామాబాద్‌లో టి.జీవన్‌రెడ్డి, మహబూబాబాద్‌లో బలరాంనాయక్, చేవెళ్లలో సునీత మహేందర్‌రెడ్డి, నల్లగొండలో రఘువీర్‌రెడ్డి, కరీంనగర్‌లో ప్రవీణ్‌రెడ్డిల పోటీకి ఎవరి నుంచి ఎలాంటి అభ్యంతరాలు లేక పోవడంతో వారి అభ్యర్థిత్వాలకు సీఈసీ ఆమోదం తెలిపినట్లు తెలిసింది. జహీరాబాద్ స్థానానికి సురేశ్ షెట్కార్, ఉజ్వల్‌రెడ్డిల పేర్లను పరిశీలించినట్లు సమాచారం.

కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై చర్చించేందుకు గురువారం సాయంత్రం కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ ఏఐసీసీ కార్యాలయంలో భేటీ అయ్యింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీతో పాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, అంబికా సోని, తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఈసీ సభ్యుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి పరిశీలనలోకి వచ్చిన అభ్యర్థుల వివరాలు, స్క్రూటినీ అనంతరం మిగిలిన అభ్యర్థుల వివరాలను సీఈసీ ముందుంచారు. రెండున్నర గంటల పాటు జరిగిన భేటీలో సునీల్ కనుగోలు సహా ఏఐసీసీ స్థాయిలో చేసిన సర్వేల నివేదికలు ముందుపెట్టుకొని నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల జాబితాను పరిశీలించారు. మొదటగా సింగిల్ పేర్లతో కూడిన స్థానాలను కమిటీ పరిశీలించింది. మొత్తంగా 8–10 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు జాబితాను ఏ క్షణమైనా విడుదల చేసే అవకాశం ఉందని అంటున్నారు.

మరిన్ని స్థానాలపై చర్చ

మిగతా స్థానాలపై కూడా చర్చించినా, మరోమారు సమావేశమై సర్వేల ఆధారంగా అభ్యర్థులను ఫైనల్ చేద్దామనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. సికింద్రాబాద్‌లో ఇటీవలే పార్టీలో చేరిన బొంతు రామ్మోహన్ దంపతులు, నాగర్‌కర్నూల్‌లో మల్లురవి, సంపత్ కుమార్, వరంగల్‌లో దారా సాంబయ్య సహా మరో పేరు, మల్కాజిగిరిలో చంద్రశేఖర్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు, మెదక్‌లో మైనంపల్లి హన్మంతరావు, నీలం మధు, ఆదిలాబాద్‌లో ఆదివాసీలైన ఇద్దరి పేర్లపై చర్చ జరిగినట్లు తెలిసింది. ఆయా స్థానాలపై వచ్చే వారంలో తుది నిర్ణయం చేసే అవకాశాలున్నాయని అంటున్నారు.

ఇక్కడి నుంచి రాహుల్ పోటీ లేనట్టే!

తెలంగాణలోని ఏదో ఒక నియోజకవర్గం నుంచి పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీని పోటీకి దింపాలన్న రాష్ట్ర నేతల వినతిని ఏఐసీసీ తిరస్కరించినట్లు తెలిసింది.

జిల్లా వార్తలు

క్లుప్తంగా

తప్పిపోయిన మహిళ కుటుంబం చెంతకు..

కరకగూడెం: మేడారం జాతరకు వచ్చి తప్పిపోయి కరకగూడెం చేరిన మహిళను పోలీసులు గురువారం కుటుంబం చెంతకు చేర్చారు. జనగాం జిల్లా బచ్చన్నపేట మండలం సిద్ధులగుట్ట గ్రామానికి చెందిన దుండుగుల వెంకటమ్మ 15 రోజుల క్రితం మేడారం జాతరకు కుటుంబ సభ్యులతో వచ్చి తప్పిపోయింది. ఈ నెల 5న కరకగూడెం మండలంలోని మోతె గ్రామానికి చేరుకోగా, గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న ఎస్సై రాజేందర్ ఆమెను విచారించి వివరాలు సేకరించారు. ఆమెను అమ్మానాన్న వృద్ధాశ్రమంలో ఉంచి, బచ్చన్నపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే అప్పటికే పలుచోట్ల వెతికిన కుటుంబ సభ్యులు ఆచూకీ లేకపోవడంతో అక్కడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడి పోలీసుల సమాచారంతో గురువారం వచ్చిన కుటుంబ సభ్యులకు వెంకటమ్మను అప్పగించినట్లు ఎస్ఐ ఎ.రాజేందర్ తెలిపారు.

రౌడీషీటర్ ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: ఉరివేసుకుని ఓ రౌడీషీటర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం జరిగింది. ఎస్ఐ శ్రీరాముల శ్రీను కథనం ప్రకారం.. మండలంలోని పేరాయిగూడెం పంచాయతీ మోడల్ కాలనీకి చెందిన షేక్ మస్తాన్(46) కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ఓ గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. కాగా నాలుగు రోజుల క్రితం అతిగా మద్యం తాగి పక్కింటి వాళ్లతో గొడవపడి దుర్భాషలాడాడు. ఆ తర్వాత స్థానిక మోడల్ కాలనీలోని తన స్నేహితుడైన ఎండీ జాఫర్ ఇంటికి వచ్చి ఉంటున్నాడు. ఈ క్రమంలోనే గురువారం కూడా మద్యం తాగి, స్నేహితుడి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఎస్ఐ శ్రీను ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు ఐదేళ్ల క్రితం ఓ వివాహితను హతమార్చాడు. ఇతనిపై అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ రౌడీ షీట్ కూడా ఉంది. ఈ గొడవల నేపథ్యంలోనే మస్తాన్ భార్య, కుమార్తె, కుమారుడితో కలిసి హైదరాబాద్‌లో జీవనం సాగిస్తోంది. మృతుడి కుమార్తె షహానాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడి

దమ్మపేట: మండలంలోని వడ్లగూడెం గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై పోలీసులు గురువారం దాడి చేసి, కేసు నమోదు చేశారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, బైక్, కోడిపుంజు, రెండు మొబైల్‌ఫోన్లు, రూ.14 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

మహిళల్లో మణిపూసలు..



- వృత్తి, వ్యాపారాల్లో రాణిస్తున్న వనితలు
- స్వయం ఉపాధితో కుటుంబాలకు అండ
- మరికొందరికి పని కల్పిస్తూ ఆదర్శంగా..

రేపటికి ముందడుగు

అవకాశాలను అందిపుచ్చుకుంటూ.. అవరోధాలను ఎదుర్కొంటూ.. కష్టాలను దిగమింగుతూ అతివలు ప్రగతి పథంలో పయనిస్తున్నారు. వ్యాపారం, ఉద్యోగం చేసే వృత్తి ఏదైనా అంకితభావం, ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగుతున్నారు. స్వశక్తిపై నిలబడటమేకాక పలువురికి ఉపాధి కల్పిస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు..

ఆటోతో ఇంటికి ఆసరాగా..

– దేవర్ల ఉమ



ఆటో నడుపుతున్న దేవర్ల ఉమ

మణుగూరు టౌన్: ఏ జీవనాధారమూ లేదు. తల్లిదండ్రులు కూడబెట్టిన ఆస్తీ లేదు. దీంతో ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబానికి అండగా నిలుస్తోందో మహిళ. పట్టణంలోని బాపనకుంటకు చెందిన దేవర్ల ఉమ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ ప్రైవేటు కంపెనీలో సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్న భర్తకు చోదోడు వాదోడుగా ఉంటోంది. ఏడో తరగతి చదివిన ఆమె అందరికీ ఆదర్శంగా ఉంటూ శభాష్ అనిపించుకుంటున్నారు. ప్రయాణికులతోపాటు కూలీలను చేల వద్దకు చేర్చుతూ, తీసుకొస్తూ రోజుకు కనీసం రూ.400 సంపాదిస్తోంది. ప్రస్తుతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఇంటి సమస్యల ముందు ఆటో నడిపేందుకు వెనుకడుగు వేయాలనిపించలేదని ఉమ చెబుతున్నారు.

అభయారణ్యంలో అతివలు

పాల్వంచరూరల్: సాధారణంగా మహిళలు అటవీ ప్రాంతం నుంచి ప్రయాణించాలంటే భయపడుతుంటారు. కానీ కిన్నెరసాని అభయారణ్యం(వైల్డ్‌లైఫ్ డివిజన్)లో దట్టమైన అడవిలో వన్యమృగాల మధ్య 20 మంది మహిళలు బీట్ ఆఫీసర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. హారిక, ఎ.పార్వతి, డి.సునీత, ఎ.దుర్గా, ఐ.లక్ష్మీప్రసన్న, బి.శిరీష, జి.ప్రమీల, ఎం.శారద, బి.కవిత, బి.కల్పన, టి.అనూష, ఐ.శ్రీదేవి, బి.దేవి. బి.నాగమణి, బి.కాంతి, ఎం.సుమిత్ర, పి.కృష్ణచైతన్య, ఎల్. శారద, బి.దుర్గ ఆయా రేంజ్‌ల పరిధిలో తమకు కేటాయించిన బీట్లలో రాత్రి వేళల్లో కూడా మొక్కవోని ధైర్యంతో విధులు నిర్వర్తిస్తున్నారు. అటవీప్రాంతంలో వన్యమృగాల నడుమ పనిచేస్తున్నారు. అడవిలో కాలినడకన తిరుగుతూ అటవీ, వన్య ప్రాణుల సంరక్షణకు కృషి చేస్తున్నారు. అయితే అడవిలో ఒంటరిగా వెళ్లినప్పుడు జంతువుల అరుపులు వినిపిస్తే ఒకింత భయంగా ఉంటుందని, అయినా కర్తవ్యం నెరవేర్చేందుకు ముందుకు సాగుతున్నామని చెబుతున్నారు.



అటవీ ప్రాంతంలో మహిళా బీట్ ఆఫీసర్లు

స్వశక్తితో వ్యాపారం.. 10 మందికి ఉపాధి



యశోద నిర్వహిస్తున్న స్వీట్ షాప్

ఇల్లెందురూరల్: భర్త చనిపోయినా మనోధైర్యంతో వ్యాపారంలో రాణిస్తోంది. మరో 10 మందికి ఉపాధి చూపుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. మండలంలోని సుభాష్‌నగర్‌కు చెందిన గడ్డం వెంకటేశ్వర్లుతో యశోదకు 2012లో వివాహమైంది. వారికి పాప (లోహిత) జన్మించింది. స్వీట్ షాప్, పాల కేంద్రం నిర్వహణతో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న తరుణంలో వెంకటేశ్వర్లు గుండెపోటుతో 2019లో మృతిచెందాడు. అప్పటి నుంచి యశోద వ్యాపారంలో ఓనమాలు నేర్చుకుని రాణిస్తోంది. స్వీటు షాపు వ్యాపారాన్ని భర్త కంటే మిన్నగా విస్తరించి పది మందికి ఉపాధి కల్పిస్తోంది. నాణ్యమైన స్వీట్లు తయారు చేస్తూ నేడు ఇల్లెందులో అతిపెద్ద స్వీట్‌షాప్‌గా తీర్చిదిద్దుకుంది. వివాహమైన కొన్నేళ్లకే భర్త చనిపోయినా స్వశక్తిపై నిలబడి పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న తన కుమార్తెను ఉన్నత విద్యావంతురాలిగా చేయడమే జీవిత లక్ష్యమని యశోద పేర్కొంటోంది.

మీ సేవ కేంద్రం నడుపుతూ..



దరఖాస్తులు స్వీకరిస్తున్న సరోజిని

కరకగూడెం: ములుగు జిల్లా వెంకటాపురం మండలం కొండాపురానికి చెందిన సరోజిని కరకగూడెం మండలంలోని రేగుళ్ల గ్రామానికి చెందిన గోగు రామారావును 2015లో ప్రేమ వివాహం చేసుకుంది. కరోనా మహమ్మారి 2020లో రామారావును బలితీసుకుంది. అయినా మనోధైర్యంతో మీ సేవ కేంద్రం నిర్వహిస్తోంది. సోదరి కృష్ణకుమారిసాయం తీసుకుంటూ తన ఏడేళ్ల కుమారుడితో జీవనం సాగిస్తోంది. డిప్లొమా చదివిన ఆమె స్వయం ఉపాధి పొందుతూ ఆదర్శంగా నిలుస్తోంది.

పండ్ల వ్యాపారం చేస్తూ..



పండ్లు విక్రయిస్తున్న రజియా బేగం

మండల కేంద్రానికి చెందిన పఠాన్ రజియా బేగంకు 2010లో భద్రాలానికి చెందిన షేక్ సాధిక్ పాషాతో వివాహం జరిగింది. 2016లో భర్త గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో దిక్కుతోచని స్థితిలో పుట్టింటికి వచ్చింది. కొన్ని రోజులకు తండ్రి కూడా చనిపోయాడు. తాను మరొకరికి భారం కాకూడదనే ఉద్దేశంతో గ్రామంలోని తన ఎనిమిదేళ్ల కుమారుడితో అద్దె ఇంట్లో జీవనం సాగిస్తోంది. కరకగూడెంలో పండ్ల దుకాణం నడుపుతున్న ఆమె జీవితంలో ఎన్ని కష్టాలు వచ్చిన ధైర్యాన్ని కోల్పోవద్దని చెబుతోంది.

అడవి బిడ్డల అక్షర ‘జ్యోతి’



బురదలో నడుచుకుంటూ పౌష్టికాహారం తీసుకెళ్తున్న జ్యోతి

కొత్తగూడెంరూరల్: గొత్తికోయల పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తూ ఓ అంగన్‌వాడీ కార్యకర్త పలువురి ప్రశంసలు అందుకుంటోంది. లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమళ్ల పంచాయతీ గంగమ్మ కాలనీలో జ్యోతి మినీ అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తోంది. ఇక్కడ 30 మంది పిల్లలు, ఇక్కడికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని క్రాంతినగర్‌లో మరో 32 మంది.. మొత్తం 62 మంది గొత్తికోయ పిల్లలకు ఆటపాటలతో విద్య నేర్పిస్తోంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి పొట్ట చేత పట్టుకుని వచ్చిన వారి పిల్లలకు అక్షరజ్ఞానం పెంపొందించేందుకు గొత్తి కోయలు మాట్లాడే భాష కూడా నేర్చుకుంది. మీలాగా మీ పిల్లలు కూడా కూలి పనులు చేసుకోకుండా ఉండాలంటే అక్షరాలు నేర్చుకోవాలని వారి భాషలో అవగాహన కల్పించింది. అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లు, మధ్యాహ్న భోజనం వడ్డిస్తూ అడవి బిడ్డలకు అక్షరజ్యోతిగా మారింది. వర్షాకాలమైతే బురదలో నడిచి వెళ్లక తప్పదు. అయినా భర్త రూప్లా సహాయంతో ఆదర్శంగా విధులు నిర్వర్తిస్తోంది. ఆమె కృషినిగుర్తించి ఎన్నో అవార్డులు వరించాయి. ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా, రూ. లక్ష ప్రైజ్ మనీతోపాటు అవార్డును అప్పటి మంత్రి సత్యవతి రాథోడ్ చేతుల మీదుగా అందుకుంది. 2019, 2022లో ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా ఎంపికైంది. గతేడాది చైతన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానం పొందింది.

నేను ఇక్కడ పని చేస్తానని అనుకోలేదు



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో..

తొలుత గొత్తికోయల పరిస్థితి చూసి భయం వేసింది. నేను అక్కడ పని చేయలేనని అనుకున్న. కానీ వారి పరిస్థితులు పూర్తిగా అర్థం చేసుకున్నాక ఐసీడీఎస్ పీడీ, సూపర్ వైజర్ల సహాయంతో దాతల సాయంతో అంగన్‌వాడీ సెంటర్‌కు గది కట్టించాం. తొలుత అంతగా కలిసిపోయేవారు కాదు. కానీ ఇప్పుడు నేను వారిలో భాగమయ్యాను. వారి పండుగలకు నన్ను తప్పనిసరిగా పిలుస్తారు.

చంటి బిడ్డను లాలిస్తూ... పాఠాలు బోధిస్తూ...



పాఠశాలలో బిడ్డను లాలిస్తున్న టీచర్ ఉమ

టేకులపల్లి: ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు తన బిడ్డను లాలిస్తూ పాఠశాలల్లో పిల్లలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. ఇల్లెందు మండలం రాఘబోయినగూడేనికి ఈసం ఉమ 2012లో ప్రభుత్వ టీచర్‌గా ఉద్యోగం సాధించింది. భర్త శరత్‌బాబు కూడా ప్రభుత్వ ఉపాధ్యాయుడే. ప్రస్తుతం వీరికి ఐదేళ్ల బాబు అర్జున్, రెండేళ్ల పాప అభినందన ఉన్నారు. ఉమ టేకులపల్లి మండలం సులానగర్ ఉన్నత పాఠశాలలో నుంచి ఇటీవల బోడు హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. రెండేళ్లుగా పాపను ఎత్తుకుని పాఠశాలకు వెళ్తున్నారు. పాపను స్టాఫ్ రూంలో పడుకోబెట్టి తను క్లాసుకు వెళ్లి పాఠాలు బోధిస్తుంది. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేస్తోంది. తల్లిగా, టీచర్‌గా ఏమాత్రం అలసట, బాధ కనిపించకుండా చిరునవ్వుతో ముందుకు సాగుతోంది.